భువనగిరి వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం నియామకం


కానుకుంట్ల రేఖ


బైసు రాజేష్

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామానికి చెందిన కానుకుంట్ల రేఖ ఛైర్‌పర్సన్‌గా, బొమ్మలరామారానికి చెందిన బైసు రాజేష్ వైస్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆనవాయితీగా ఆలేరు నియోజకవర్గం బొమ్మలరామారానికి రెండు డైరెక్టర్ పదవులతో పాటు వైస్ ఛైర్మన్ పదవి దక్కడం గమనార్హం. కానుకుంట్ల రేఖ గతంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలిగా పనిచేశారు. నాటి నుంచి నేటి వరకు ఆమె కుటుంబం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతోంది. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దగ్గరి బంధువులు బొల్లేపల్లి గ్రామానికి చెందిన వారు కావడంతో 2016 నుంచి ఆమె భర్త బాబురావుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. రేఖ పదో తరగతి వరకు చదివారు. వైస్ ఛైర్మన్ రాజేష్ ఇంటర్ వరకు చదివారు. రాజేష్ అట్టల పరిశ్రమ నిర్వహిస్తున్నారు. బొమ్మలరామారం మండలానికి లంకు చెందిన ముగ్గురు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్య అనుచరులుగా కొనసాగుతుండటంతో పదవులు దక్కడం గమనార్హం. పాలకవర్గం సభ్యులుగా కొలిచెలిమి శ్యాం, తాడూరు నర్సింహ, బాణోతు దేవిసింగ్, మద్ది అంజిరెడ్డి, రేసు కుంట్ల లాలయ్య, చిన్నం శ్రీనివాస్, పిట్టల రజిత, కుక్క దానయ్య, ధీరావత్ శ్రీను, దేశెట్టి చంద్రశేఖర్, పొద్దటూరి ప్రశాంత్, రంగా కిష్టయ్య, బీబీనగర్ పీఏసీఎస్ ఛైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయశాఖ ఏడి, భువనగిరి మున్సిపల్ ఛైర్మన్ నియమితులయ్యారు. కమిటీ పాలకవర్గం నియామకం తేదీ నుంచి రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏడాదిన్నరగా 1200 కుటుంబాల నిరీక్షణ



భువనగిరి పట్టణం హుస్సేనాబాద్‌లోని బీఎన్ తిమ్మాపురం గ్రామం భూనిర్వాసితుల కాలనీలో నిర్మాణ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. కాలనీలోని 1200 కుటుంబాలకు నీటి సదుపాయం కల్పించేందుకు ఐదు సెక్టార్లలో రెండు 200 కేఎల్ నిలువ సామర్థ్యం కలిగిన భారీ ట్యాంకులను నిర్మిస్తున్నారు. ఒక ట్యాంకు నిర్మాణం 18 నెలల క్రితం ప్రారంభించారు. ప్రారంభించిన ఆరు నెలల్లో పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటి నేటికీ ట్యాంకులతో పాటు పైప్ లైన్ పనులు కొనసాగుతుండటం గమనార్హం. రెండు ట్యాంకులతో పాటు 14 కి.మీ.ల పొడవు పైప్ లైన్ నిర్మాణాలకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 11 కి.మీ.ల పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. నీటి సదుపాయంతో పాటు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించిన పక్షంలో నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనులు పూర్తి చేసి నిర్వాసితులకు ప్రయోజనం చేకూర్చాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గుండూరావు వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

– న్యూస్‌టుడే, భువనగిరి పట్టణం

ఆందోళన పథం



రైతు భరోసా పథకం అమలు చేయడం లేదని భారాస శ్రేణులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఆత్మకూరులో నిర్వహించిన ధర్నాలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్. -న్యూస్‌టుడే, ఆత్మకూర్(ఎం)

పోచంపల్లి అర్బన్ బ్యాంకుకు పురస్కారాలు

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: లఖ్‌నవులో జరిగిన 2023-24 జాతీయ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల సమ్మేళనంలో రెండు జాతీయ పురస్కారాలు కైవసం చేసుకున్నట్లు పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ తడ్క రమేష్ తెలిపారు. ఈ నెల 19న లఖ్‌నవులో జరిగిన జాతీయ కోఆపరేటివ్ బ్యాంకుల సమ్మేళనంలో బెస్ట్ క్రెడిట్ ఇన్షియేటివ్, బెస్ట్ ఎన్‌పీఏ మేనేజ్‌మెంట్ విభాగాల్లో పురస్కారాలు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో సీత శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు, సీనియర్ మేనేజర్ మధు పాల్గొన్నారు.


ముంబయి బ్యాంకింగ్ ప్రతినిధుల నుంచి పురస్కారం స్వీకరిస్తున్న బ్యాంకు పాలకవర్గం

చిన్నారిని చేయొద్దు.. పెళ్లికూతురు..!



> రెండేళ్ల క్రితం కొండమల్లేపల్లి మండలంలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులపై తల్లిదండ్రులు తిరగబడ్డారు.

> ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఉన్న తండాలు, మారుమూల గ్రామాల్లో నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లేమి, మూఢ నమ్మకాలతో పదో తరగతి, ఇంటర్ పూర్తి కాగానే బాల్య వివాహాలు చేస్తున్నారు. నల్గొండ జిల్లాలోని డిండి, చందంపేట మండలాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

ప్రభుత్వాలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. సమాజంలో బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడడం లేదు. మారుమూల గ్రామాలు సైతం సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్న నేటి తరుణంలో సైతం నిత్యం బాల్య వివాహాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా వందకు పైగానే బాల్య వివాహాలను అధికారులు అడ్డుకుంటున్నప్పటికీ.. గుట్టు చప్పుడు కాకుండా జరిగేవి మరెన్నో ఉంటున్నాయి.


మిర్యాలగూడ: ఆలగడప జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మమత(పాత చిత్రం)

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు..



బాల్య వివాహాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం 141 పేజీల తీర్పులో పలు మార్గదర్శకాలు జారీ చేసింది. చిన్నారుల జీవన, విద్య, ఆశలు, ఆరోగ్యం, హక్కులను చిదిమేసే బాల్య వివాహాలను నిర్మూలించేందుకు బాహుముఖ కార్యాచరణ చేపట్టాలని సూచించింది. బాల్య వివాహాల నిర్మూలనకు జిల్లాకో ప్రత్యేక అధికారిని నియమించడంతో పాటు.. ఈ కార్యక్రమంలో కలెక్టర్లు, ఎస్పీలను భాగస్వాములను చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్..



బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం **1098** టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం..

– కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారిణి, నల్గొండ



బాల్య వివాహాల నిర్మూలనకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లోని విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. బాలికలను విద్యాసంస్థల్లో చేర్చడం, జిల్లా కేంద్రంలోని బాల సదన్‌కు పంపడం వంటి చర్యలు చేపడతాం.

ఉమ్మడి జిల్లాలో 2020 నుంచి అడ్డుకున్న బాల్య వివాహాల వివరాలు.. (2024 అక్టోబరు వరకు)

జిల్లా	2020	2021	2022	2023	2024
నల్గొండ	50	42	41	43	17
సూర్యాపేట	72	55	72	35	43
యాదాద్రి	26	22	14	21	12

అనారోగ్య సమస్యలు: – డాక్టర్ జీవనజ్యోతి, మిర్యాలగూడ



బాల్య వివాహాల వల్ల బాలికలకు హార్మోన్ల అసమతౌల్యతతో పాటు శారీరక, మానసిక సమస్యలు ఏర్పడతాయి. సరైన అవగాహన లేకుండా గర్భం దాల్చడం వల్ల రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలతో పాటు మానసిక పరిపక్వత లేకపోవడంతో భార్యభర్తల మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకునే ప్రమాదం సైతం ఉంది.

యాదాద్రి క్షేత్రంలో భక్తజన సందడి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తజనులతో సందడి, ఆర్జిత కైంకర్యాలతో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు మూలవరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, నిత్యకల్యాణం, స్వర్ణ పుష్పారాధన, అలంకార సేవోత్సవాలు ఆలయ ఆచారంగా కొనసాగించారు. అనుబంధంగా ఉన్న పాతగుట్ట ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామిని కొలుస్తూ నిజాభిషేకం, తులసీ అర్చన, నిత్య కల్యాణం పాంచరాత్రాగమ శాస్త్ర రీత్యా నిర్వహించారు. ఆలయ దేవుడి దర్శనం చేసుకున్న భక్తులు పలువురు కుటుంబీకులతో వన భోజనాల పర్వాన్ని జరుపుకొన్నారు. యాదాద్రిలోని శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శైవాగమ ఆచారంగా పూజలు కొనసాగాయి. భక్తజనులతో ఆలయ రహదారులు, ఆధ్యాత్మికవాడ, లక్ష్మీ పుష్కరిణి, బస్‌స్టేషన్, కల్యాణకట్ట, కొండపైన బస్‌బే, పార్కింగ్ ప్రాంగణాలు కోలాహలంగా మారాయి.


హోమం నిర్వహిస్తున్న యాజ్ఞికులు

విరాళాల సేకరణ విభాగం ప్రారంభం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. విరాళాల సేకరణ విభాగం, వేచి ఉండే షెడ్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. భక్తుల బస కోసం కొండపైనే 200 గదులు నిర్మించాలని, యాత్రికులకు చెందిన రెండు వేల వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు త్వరలోనే తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. స్వర్ణ విమానం కోసం దాతలు సమర్పించే విరాళాల సేకరణకు దేవస్థానం విభాగం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే రూ.1.11 లక్షల చెక్కును ఈవో భాస్కర్‌రావుకు అందజేశారు. వచ్చే కార్తిక మాసంలో కొండ కింద కొత్తగా నిర్మించిన నిత్యాన్న ప్రసాద సముదాయం ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.


ఈవో భాస్కర్‌రావుకు చెక్కు అందజేస్తున్న విప్ అయిలయ్య

పరికరాల కొరత.. సాగని విద్యుదీకరణ

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

పెరుగుతున్న విద్యుత్తు సర్వీసులకు అనుగుణంగా చేపడుతున్న విద్యుదీకరణ పనులకు బ్రేకులు పడుతున్నాయి. సంస్థలో పరికరాల కొరత వేధిస్తోంది. వానాకాలం పంటల నూర్పిడి పూర్తి కానుండటంతో నిలిచిన, కొత్తగా చేపట్టాల్సిన పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు ముందుకు వస్తున్నా.. విద్యుదీకరణ పనులకు కావాల్సిన ప్రధాన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


దిమ్మె నిర్మించినా ఏర్పాటు చేయని విద్యుత్తు నియంత్రిక

మరమ్మతులతో సరఫరాకు అంతరాయం

రైతులు విద్యుత్తు నియంత్రికల కోసం డీడీలు చెల్లించినా.. మంజూరైన స్తంభాలు, తీగ, ఏబీ స్విచ్‌లు, హెడ్జ్ ఫ్యూజుల కాసారాలు, క్లాంపులు వంటి సామగ్రి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం అధికారులు అందించలేకపోతున్నారు. నియంత్రికల వద్ద కరెంటు సరఫరాను నియంత్రించడంలో కీలకమైన ఏబీ స్విచ్‌ల కొరత ఎప్పటి నుంచో వేధిస్తోంది. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే విద్యుత్తు ఉపకేంద్రాల్లో కరెంటు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది.

మంత్రి కోమటిరెడ్డి చొరవతో..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో నల్గొండ, యాదాద్రి భువనగిరి సర్కిళ్ల పరిధిలో సుమారు 1050కి పైగా విద్యుత్తు నియంత్రికలు, 1125కి పైగా ఏబీ స్విచ్‌ల కొరత నెలకొంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా విద్యుత్తు శాఖపై సమీక్ష నిర్వహించారు. పరికరాల కొరతను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు సీఎండీతో చర్చించినట్లు తెలిసింది. మంత్రి కోమటిరెడ్డి చొరవతో 250 వరకు నియంత్రికలు అందజేస్తామని హామీ ఇచ్చారని సమాచారం. ఈ మేరకు ఇటీవల వంద ట్రాన్స్‌ఫార్మర్లు నల్గొండ జిల్లాకు చేరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇంకా 900లకు పైగా విద్యుత్తు నియంత్రికలు తక్షణం అవసరం ఉంది.

రైతుల నిరీక్షణ..!

రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారా నియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ నియంత్రికల కొరతతో పనుల్లో జాప్యం నెలకొంటుంది. దేవరకొండ, నల్గొండ, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టాల్సి ఉండగా.. పరికరాల కొరతతో అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది.

అవసరం ఉంటే తెప్పిస్తాం

వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ, విద్యుత్తు సంస్థ నల్గొండ సర్కిల్

కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. పూర్తి వివరాలు తెలుసుకుంటాం. విద్యుత్తు పరికరాల నిల్వలపై, కొరతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తా. నియంత్రికలు, ఏబీస్విచ్‌లు అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపిస్తాం. ఉన్నతాధికారులతో చర్చించి తెప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని డి.రేపాక శివారు సర్వే నెంబర్165 ప్రభుత్వ భూమిలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం స్థల పరిశీలన చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు వరసలో నిలిపేందుకు తనవంతు కృషి చేస్తున్నానన్నారు. సర్కారు భవనాల నిర్మాణాల కోసం ప్రజలకు చేరువలో ఉండే ప్రభుత్వ భూమిని పరిశీలించి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగయ్యయాదవ్, ఇటికాల చిరంజీవి, జోజి, లక్ష్మయ్య, సత్యనారాయణ, చంద్రయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


అడ్డగూడూరు: డి.రేపాక శివారులో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, రెవెన్యూ అధికారులు

దివ్యాంగ పింఛన్‌లో కేంద్రం వాటా పెంచాలి

మోత్కూరు, న్యూస్‌టుడే: దివ్యాంగులకు 2011 నుంచి కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.300 ఇస్తోందని, నిత్యావసర సరకుల ధరలు పెరిగినందుకు గాను కేంద్రం తన వాటాను రూ.ఐదు వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. మోత్కూరులో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచాలని కోరారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి జ.యాదగిరి, మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి నాగేశ్వర్, నాయకులు నరేశ్, వెంకన్న, చంద్రయ్య, సత్తయ్య, యాకయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.


మోత్కూరులో నిరసన తెలుపుతున్న దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రతినిధులు

టోకెన్ ఉంటేనే కొనుగోళ్లు..!


చివ్వెంల కొనుగోలు కేంద్రంలో ధాన్యం దిగుమతి చేస్తున్న దృశ్యం

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే:

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాప్తంగా 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వాటిల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం తనిఖీలు చేపడుతోంది. పర్యవేక్షణకు మండల స్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేశారు. అవకతవకల నివారణకు గతంలో మాదిరిగానే ఈసారి కూడా టోకెన్ల విధానం అమలు చేస్తున్నారు.

తేమ శాతం 17 వస్తేనే జారీ

నిబంధనలు ఇలా..

- ముందుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన సమయంలో నిర్వాహకులు రైతు పేరు, వివరాలు నమోదు చేసుకుంటారు.
- మండల వ్యవసాయ అధికారులు ధాన్యం తేమ శాతం పరిశీలిస్తారు.
- 17 శాతం తేమ వచ్చిన తరువాత సంబంధిత రైతుకు టోకెన్ అందిస్తారు.
- దాని ప్రకారం ధాన్యాన్ని బస్తాల్లో ఎప్పుడు నింపుతారు, మిల్లుకు ఎప్పుడు తరలిస్తారో.. చెబుతారు.

ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల వివరాలు

జిల్లా	కేంద్రాలు
నల్గొండ	366
సూర్యాపేట	266
యాదాద్రి	275



అవకతవకలకు చెక్!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 10.42 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసి సన్న, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనడానికి కేంద్రాలు ఏర్పాటు చేశారు. టోకెన్ విధానం లేనప్పుడు కేంద్రం నిర్వాహకులు అవకతవకలకు పాల్పడేవారు. నగదు ముట్టజెప్పిన రైతుల ధాన్యాన్ని కాంటాలు వేశారు. మిల్లర్లు ఆ ధాన్యానికి కోత విధించేవారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఇతర గ్రామాల ధాన్యాన్ని, దళారుల సరకునూ ఆయా నిర్వాహకులు కొనుగోలు చేసేవారు. దీంతో కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతులు ఇబ్బందులు పడాల్సిన వచ్చేది. కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంతో అవకతవకలకు తావు లేకుండా సజావుగా కొనుగోళ్లు జరుగుతున్నాయి.

రైతులు ఏం చేయాలంటే..?

- ❑ రైతు తన వెంట ఆధార్ కార్డు, పట్టా పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం నకలును రెండు సెట్లు తీసుకురావాలి.
- ❑ కౌలు రైతు మండల వ్యవసాయ అధికారుల వద్ద పేరు నమోదు చేసుకోవాలి.
- ❑ ఆధార్, పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేయించుకోవాలి.
- ❑ అప్పుడే ధాన్యం కాంటా పూర్తయిన రెండ్రోజుల్లో నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

పారదర్శకంగా చేపట్టేలా ఆదేశాలు

– పద్మ, డీసీవో, సూర్యాపేట

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపడుతున్నాం. పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. తేమ శాతం వచ్చిన రైతులకు మాత్రమే టోకెన్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

యువత చూపు.. మద్యపాన నిషేధం వైపు..!



గట్టికల్‌లో మద్య నిషేధానికి కదిలిన యువకులు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే:

అర్ధరాత్రి వరకు గొడవలు, ఘర్షణలు, నలభై ఏళ్లకే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని ఇంటిపెద్ద మృతి, చిన్న వయసులోనే వితంతువుగా మారిన మహిళలు, వారిపై పిల్లల భారం, తాగొచ్చి భర్త చేసే అల్లరికి తాళలేక పుట్టింటికి వెళ్లిన భార్య.. ఆలూమగల పంచాయితీలో నలిగిన చిన్నారులు.. ఇవీ పల్లెల్లో విచ్చలవిడి మద్యం విక్రయాలతో కనిపిస్తున్న హృదయ విదారక దృశ్యాలు. పగలూ, రాత్రి మద్యం విక్రయించే గొలుసు దుకాణాలు పచ్చని సంసారాల్లో చిచ్చు రేపుతున్నాయి. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఈ ఘటనలను కళ్లారచూసిన యువత మద్యపాన నిషేధం వైపు అడుగులు వేస్తోంది. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలంలో పలు గ్రామాల్లో యువ చైతన్యం మద్యం మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతోంది.

◆ గొలుసు దుకాణాలకు అడ్డుకట్ట వేస్తున్న యువకులు

ఇస్తాళాపురంలో మొదలై..

మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలో 2015 సెప్టెంబరు 21 నుంచి మద్యపాన నిషేధం అమలులోకి వచ్చింది. తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొని పదో సంవత్సరంలోకి అడుగిడింది. ఈ గ్రామంలోని మహసేన, యువ, వింగ్స్ తదితర యువజన సంఘాల యువకులు ఏళ్లతరబడి పట్టుదలతో కట్టడి చేయడంతోపాటు జరిమానాలు విధిస్తున్నారు.

★ ఇస్తళాపురం గ్రామం స్ఫూర్తితో ఇటీవల అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గట్టికల్, పాతర్లపహాడ్ గ్రామాల్లో మద్యపానాన్ని నిషేధించాలంటూ తీర్మానాలు చేశారు. ఆ తీర్మానం గట్టికల్‌లో ఈ నెల 14 నుంచి, పాతర్లపహాడ్‌లో 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఉద్యమంలో యువజన సంఘాలు అఖిలపక్ష పార్టీలు, అధికారులకు, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా చైతన్యం కోసం ద్విచక్ర వాహన ర్యాలీలు తీశారు. ప్రతి గొలుసు దుకాణానికి వెళ్లి అవగాహన కల్పించి మూసి వేయించారు. గట్టికల్‌లో జైభారత్, సర్దార్, అరుంధతి, కంఠమహేశ్వర, లెనిన్, సర్వోత్తమ్, చైతన్య జ్యోతి, గోల్డెన్‌స్టార్, బంగారుగడ్డ యువజన సంఘాల సభ్యులు ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

★ పాతర్లపహాడ్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ యంగ్‌స్టార్ యువజన సంఘం, గోల్డెన్‌స్టార్, కౌండిన్య, నవోదయ యువజన సంఘం యువకులు అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్థులను చైతన్యపరిచారు. మండలంలో ముక్కుడుదేవులపల్లి, తుమ్మలపెన్‌పహాడ్‌లోనూ యువజన సంఘాల ప్రతినిధులు గొలుసు దుకాణాలను మూసి వేయించేందుకు గ్రామ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

ఉల్లంఘిస్తే జరిమానా

– ఇరుగు కృష్ణకుమార్, మహసేన యువజన సంఘం, ఇస్తాళాపురం



మా గ్రామంలో 2015 నుంచి మద్యపాన నిషేధం అమలులో ఉంది. ఈ మధ్యకాలంలో కొందరు నిషేధాన్ని ఉల్లంఘిస్తే వెంటనే స్పందించి జరిమానా విధించాం. గ్రామస్థుల సహకారంతో ఇప్పటికీ కట్టుబాట్లను కఠినంగా అమలు చేస్తున్నాం.

పుస్తెలతాళ్లు కుదువపెడుతున్నారు

– మడ్డి శివ, సర్దార్ యువజన సంఘం, గట్టికల్



మద్యం విచ్చలవిడిగా దొరకడంతో మా గ్రామంలో అర్ధరాత్రి జనం తిరుగుళ్లు ఎక్కువయ్యాయి. గొడవలు, కొట్లాటలు పెరిగాయి. చివరకు భార్యల పుస్తెలతాళ్లు కుదువపెట్టే పరిస్థితి దాపురించింది. తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని అమాయకులు చనిపోయారు. యువజన సంఘాలంతా ఏకమై మద్యపాన నిషేధ ఉద్యమంలో పాలుపంచుకున్నాం. గొలుసు దుకాణాలను పూర్తిగా మూసివేయించాం.

అమ్మ తినిపించాల్సిందే.. నాన్న ఎత్తుకోవాల్సిందే

మానవీయం

చౌటుప్పల్, న్యూస్‌టుడే:



ఊదరి రమణకు గోరు ముద్దలు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఆమె.. చిన్నతనంలో అందరి పిల్లల్లా అమ్మ పెట్టిన గోరుముద్దలు తిని, బుడిబుడి నడకలతో ఇల్లంతా సందడి చేసింది. మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ పాఠశాలకూ కాలినడకనే వెళ్లొచ్చేది. ఓ రోజు బడికి వెళ్తూ కాళ్లు అల్లుకుపోయి కింద పడిపోయింది. బిడ్డకేమైందోనని అయోమయంలో ఆ తల్లిదండ్రులు డాక్టర్లకు చూపించారు. చికిత్స కోసం అప్పులు చేసి రూ.నాలుగు లక్షలు ఖర్చు చేశారు. నయం కాకపోగా.. క్రమంగా కాళ్లు, చేతులు, శరీరం చచ్చుబడిపోవడంతో చదువు మాన్పించేశారు. ఆమెకు కండరాల క్షీణత వ్యాధి వచ్చిందని, చికిత్స ఏమీ లేదని వైద్యులు తేల్చి చెప్పడంతో ఆ కన్నవారి గుండె పగిలిపోయింది.

పదో తరగతిలో ఉండగా..

చౌటుప్పల్ పురపాలిక పరిధి లింగారెడ్డిగూడానికి చెందిన నిరుపేద దళితులు ఊదరి యాదమ్మ, ఊషయ్యలకు ముగ్గురు సంతానం. తమ పిల్లలు తమలాగా పారిశుద్ధ్య కూలీలుగా మారకూడదని ఊళ్లోని ప్రభుత్వ పాఠశాలకు పంపించారు. అక్కడ అయిదో తరగతి పూర్తయ్యాక మూడు కిలోమీటర్ల దూరంలో చౌటుప్పల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. అక్కాచెల్లెళ్లు కాలినడకన బడికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరేవారు. పదో తరగతి చదువుతున్న పెద్దమ్మాయి రమణ ఓ రోజు ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా కింద పడిపోయింది. అప్పటి నుంచి ఆమె కోలుకోలేదు.

నేటికీ అందని 'ఆసరా'

రెక్కాడితేనే డొక్కాడే ఆ నిరుపేద తల్లిదండ్రులు గత పదిహేనేళ్లుగా కదల్లేని తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం ముప్పయేళ్ల వయసున్న రమణ కనీసం చేతితో అన్నం కలిపి ముద్ద నోట్లో పెట్టుకోలేని, శరీరం కదిలించలేని పరిస్థితిలో ఉన్నారు. తల్లిదండ్రులే గోరు ముద్దలు తినిపిస్తున్నారు. కూలి మానుకుని అమ్మో, నాన్నో సాయంగా ఉంటున్నారు. తమ కుమార్తె నూరుశాతం దివ్యాంగురాలని 'సదరం' ధ్రువపత్రం జారీ చేసి పదకొండేళ్లవుతోందని, దరఖాస్తు చేసినా 'ఆసరా' పింఛను మంజూరు కాలేదని ఆ తల్లిదండ్రులు కన్నీరుపెడుతున్నారు.

చదువు ఇష్టం లేక విద్యార్థిని బలవన్మరణం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: చదువు ఇష్టం లేదని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బాలిక చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన ఘటన మిర్యాలగూడ పరిధిలో చోటుచేసుకుంది. మిర్యాలగూడలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. దామరచర్ల మండల పరిధిలోని ఓ తండాకు చెందిన బాలిక(14) పట్టణంలోని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన బాలిక.. తిరిగి ఈ నెల 18న మధ్యాహ్నం తండ్రితో కలిసి పాఠశాలకు వచ్చింది. సాయంత్రం తనకు కళ్లు తిరుగుతున్నాయని.. తోటి విద్యార్థులకు చెప్పగా వారు స్టాఫ్ నర్సుకు సమాచారం అందించారు. ఈ క్రమంలో తాను ఇంటి వద్ద పురుగు మందు తాగి వచ్చానని తెలపడంతో స్థానిక ప్రాంతీయాసుపత్రికి.. అక్కడి నుంచి నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతదేహానికి అక్కడే మరణోత్తర పరీక్షలు నిర్వహించి.. తల్లిదండ్రులకు అప్పగించారు. గిరిజన గురుకుల ఆర్సీవో అగస్టీన్.. విద్యార్థిని మృతిపై కలెక్టరుకు నివేదిక అందించారు. తన కుమార్తెకు చదువు ఇష్టం లేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు బాలిక తల్లి స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెలవులకు ఇంటికి వచ్చిన బాలిక తాను పాఠశాలకు వెళ్లనని చెప్పటంతో నచ్చజెప్పి పంపించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంటి వద్దే ఎవరికీ తెలియకుండా పురుగు మందు తాగి పాఠశాలకు వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ నాగార్జున తెలిపారు.


వైద్యుల నిర్లక్ష్యంపై ఆందోళన..

నల్గొండ నేరవిభాగం: మిర్యాలగూడలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె మృతి చెందడానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. పలు సంఘాల సభ్యులతో కలిసి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న అవుట్‌పోస్టు పోలీసులు ఆందోళన విరమింపజేశారు. తమకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

పత్తి విక్రయానికి సాంకేతిక సాయం

★ యాప్‌లో కొనుగోలు కేంద్రాల సమాచారం

ఆలేరు, న్యూస్‌టుడే: మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెటింగ్ శాఖ సమాచారం అందించేందుకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చింది. వాట్సప్ అప్లికేషన్‌తో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు కేంద్రాల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంటోంది. సీసీఐ కేంద్రాలకు వచ్చిన సమయం, పత్తి ఖరీదు, డబ్బులు చెల్లింపులు ఏ స్థాయిలో ఉందో సమాచారం తెలుస్తుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యలతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది?, అక్కడ సరకు విక్రయించడానికి ఎంత సమయం పడుతుందనే వివరాలను సైతం రైతులు ముందుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.



రైతులు చేయాల్సిందిలా..

☛ సీసీఐ పత్తి విక్రయానికి చరవాణి నెంబరు 88972 81111 సేవ్ చేసుకోవాలి.

☛ ఈ నెంబరుకు వాట్సప్‌లో 'హాయ్(Hi)' అని టైప్ చేయాలి. వన్‌సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ యాప్ ఓపెన్ అవుతుంది.

☛ ఇంగ్లిషు, హిందీ భాషను ఎంచుకోవాలి.

☛ పత్తి విక్రయ సమాచారం, తక్‌పట్టి వివరాలు, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం కనిపిస్తుంది.

☛ ఆ రైతు నుంచి సీసీఐ ఎన్ని క్వింటాళ్ల పత్తి కొంటుందో చూపుతుంది.

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఈ ఏడాది వానాకాలంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.18 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఇది గతేడాది కన్నా సుమారు 60 వేల ఎకరాలు ఎక్కువ. ఎకరాకు సుమారు 8-14 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 65 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడిగా వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

భార్యకు పురుగు మందు ఇచ్చి తాగిన భర్త మృతి

◆ కుమార్తె పెళ్లైన నాలుగు రోజులకు ఘటన



బడుగుల వెంకటయ్య

గుర్రంపోడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో కుమార్తె వివాహం జరిగి నాలుగు రోజులు కూడా గడవకముందే తీరని విషాదం నెలకొంది. పెళ్లికూతురు తండ్రి తన భార్యకు పురుగు మందు తాగించి.. తానూ తాగిన ఘటనలో ఆయన మృతిచెందగా.. ఆమె ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. ఈ ఘటన గుర్రంపోడు మండలం మొసంగి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బడుగుల వెంకటయ్య(45), జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు రమణ, లలిత, కుమారుడు రామాంజనేయులు ఉన్నారు. ఈనెల 16న తన పెద్ద కుమార్తె రమణ వివాహం చిల్కాపురం గ్రామానికి చెందిన యువకుడితో జరిపించారు. 19న సత్యనారాయణస్వామి వ్రతంలో వెంకటయ్య, జ్యోతి దంపతులు పాల్గొని సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వచ్చారు. ఉదయం బయటికెళ్లిన వెంకటయ్య మధ్యాహ్నం రెండింటికి ఇంటికి రావటంతో భార్య మందలించారు. 'మొన్ననే కుమార్తె పెళ్లి జరిపించాం.. నీవు ఇలా తాగుతూ కాలం గడిపితే ఎలా' అంటూ అరిచారు. వెంకటయ్య ఆమెకు తెలియకుండా పురుగు మందు కలిపిన కూల్‌డ్రింక్‌ను ఆమెకు ఇచ్చి తాగు అంటూ తానూ దాన్ని తీసుకుని ఓ గదిలోకి వెళ్లి తలుపేసుకున్నారు. ఎంతకీ వెంకటయ్య బయటికి రాకపోయేసరికి అనుమానించిన భార్య కిటికీలోంచి చూడగా వెంకటయ్య అపస్మారక స్థితిలో ఉండటం గ్రహించి బంధువులను పిలిచారు. అతన్ని నల్గొండలోని ఓ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. కొంత సమయానికి జ్యోతి కడుపులో కూడా తిప్పటం మొదలవగానే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలోని వార్డుకు తరలించారు. వెంకటయ్య మృతదేహాన్ని అక్కడే శవాగారంలో భద్రపరిచారు. ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి చికిత్స పొందుతున్న జ్యోతిని పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం




జానకిరాములు

చివ్వెంల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలోని నాల్గో వార్డు ఖాసీంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పందుల జానకిరాములు(50) గ్రామంలోని ఓ రైతు పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. పొలంలోకి దిగి మందు పిచికారీ చేస్తుండగా.. అప్పటికే పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్తు తీగను గమనించక తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. పక్కనే ఉన్న రైతు మద్ది శ్రీనివాస్ అతన్ని కాపాడేందుకు ప్రయత్నించగా.. అతనికి సైతం గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీగ తెగి పడినా మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు శివ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కనకరత్నం తెలిపారు.

యాదాద్రి ఆలయ పరిసరాల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల రీల్స్ చేసిన దృశ్యాలు ఆదివారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఆయన సతీమణి, కుమార్తె జన్మదినం సందర్భాల్లో కౌశిక్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి వీడియోలు చిత్రీకరించుకున్నారు. కుమార్తెతో ఆలయ ప్రాంగణంలో రీల్స్ చేయించారు. ఎమ్మెల్యే పదవిలో ఉన్న ఆయన ఇలా రీల్స్ చేయడం సరికాదని భక్తులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై ఈవో భాస్కర్‌రావు వివరణ కోరగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆలయంలో చిత్రీకరణ కోసం అనుమతి కోరగా ఇవ్వలేదని, ఆలయం బయట సాధారణ భక్తుల మాదిరిగా తీసుకోవచ్చని సూచించామని ఈవో వివరించారు.

కాచరాజుపల్లి సొగసు చూడతరమా!



ఓ పక్క కృష్ణా వెనుక జలాలు.. మరోవైపు భూమికి పచ్చని రంగేసినట్లు పైర్లు. వీటి మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో అలరారుతోంది.. కాచరాజుపల్లి. చందంపేట మండలంలో కృష్ణా నది ఒడ్డున ఈ గ్రామం ఉంది. ఆరునెలల పాటు కృష్ణా జలాలు, మరో ఆరు నెలలు బీడు పట్టి ఉండటం ఆ గ్రామ ప్రత్యేకత. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో రైతులు చేపల వేటకు వెళ్తుండగా.. మహిళలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. చుట్టూ నల్లమల అటవీ ప్రాంతం.. మధ్యలో కృష్ణా వెనుక జలాలు, పచ్చని పైర్లు చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ ఆధ్యాత్మిక కేంద్రాలూ ఉండటంతో దర్శనానికి వచ్చిన భక్తులు, పర్యాటకుల సందడి రోజురోజుకూ పెరుగుతోంది.

– చందంపేట, న్యూస్‌టుడే:

ఆరు తరాలు.. 141 కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం



మట్టపల్లిలో వంశ వృక్షం వేదికగా కలిసిన కుటుంబ సభ్యులు

బంధాలను చరవాణులకే పరిమితం చేసి బంధువులు సైతం ఒకరినొకరు పరిచయం చేసుకునే దుస్థితికి దిగజారిన ప్రస్తుత రోజుల్లో ఆరు తరాలకు చెందిన 141 కుటుంబాలు ఒకే వేదికపై కలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. తుల జ్ఞాపకార్థం మట్టపల్లి క్షేత్రంలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో ఆదివారం వారి వంశవృక్షం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విదేశాలతో పాటు వివిధ రాష్ట్రాలలోని బంధు గణమంతా కదిలివచ్చి అస్మదీయుల అభిమానానికి పాత్రులయ్యారు. 300లకు పైగా ఈ సమ్మేళనానికి హాజరై తమ అపూర్వ కలయికకు మూలమైన వంశాధిపతి దంపతులకు నివాళి అర్పించి అనంతరం జరిగిన ఆత్మీయ వేడుకలో పాలు పంచుకున్నారు. నాలుగు దశాబ్దాల కిందట దివంగతులైన నేరేడుచర్లకు చెందిన రాచకొండ వీరయ్య, లక్ష్మమ్మ దంపతుల వీరి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెల ఆరు తరాల సంతానం (ముది మనవళ్లు, వారి మనవళ్లు) 411 మంది కాగా మూడు వందలకు పైగా ఇక్కడి వేదికపై కలుసుకున్నట్లు పరిచయకర్త రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. శ్రీనాథ్, నాగరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు స్ఫూర్తిదాయక సమ్మేళనంలో కీలకంగా వ్యవహరించారన్నారు.

- మఠంపల్లి, న్యూస్‌టుడే:

బాలల పరిరక్షణాధికారి విచారణ

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: బాలసదన్‌లో ఓ ఉద్యోగి అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక ఆరోపించగా బాలల పరిరక్షణాధికారి సైదులు ఆదివారం విచారణ జరిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14న అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలసదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కోర్టు ఉద్యోగి(ఆఫీస్ సబార్డినేట్) ఒకరు ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలల పరిరక్షణాధికారికి ఫిర్యాదు చేసింది. ఆయన విచారణ జరపగా బాలసదన్ సిబ్బంది అలాంటిది ఏం జరగలేదని చెప్పగా సదరు బాలిక తనపై బ్యాడ్ టచ్ చేసిన మాట వాస్తవమని చెప్పింది. బాలల సంరక్షణ సమితి, బాలల పరిరక్షణ విభాగం అధికారులు బాలసదన్‌లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలు స్వచ్ఛంద సంస్థలు ఆరోపిస్తున్నాయి.

ఆంగ్లం అర్థం కావడం లేదని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కోదాడ, చిలుకూరు, న్యూస్‌టుడే: పుట్టినప్పటి నుంచి మాతృభాష తెలుగులో చదివి, ఇంటర్ వచ్చే సరికి ఆంగ్ల మాధ్యమం కావడంతో చదువు అర్థం కాక ఓ విద్యార్థి తనువు చాలించిన ఘటన చిలుకూరు మండలంలోని ఓ ప్రైవేటు ఇంటర్ కళాశాలలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి(17) చిలుకూరు మండల కేంద్రంలోని కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. దసరా సెలవులు ముగియడంతో అతన్ని తన మేనమామ కళాశాలకు తీసుకొచ్చారు. కళాశాల యాజమాన్యం ఆ విద్యార్థికి మార్కులు తక్కువగా వస్తున్నాయని మేనమామ దృష్టికి తీసుకొచ్చి మందలించింది. ఆంగ్ల మాధ్యమంలో సబ్జెక్టులు అర్థం కావట్లేదని ఎవరికీ చెప్పుకోలేక మనస్తాపానికి గురైన విద్యార్థి హాస్టల్ గదిలోనే ఉరి వేసుకున్నారు. కళాశాల సిబ్బంది గమనించి కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గంట క్రితమే కళాశాలకు పంపించామని, అంతలోనే మృతి చెందడం ఏంటనీ బంధువులు ఆరోపిస్తున్నారు. తమలాగా కూలీ పనులు చేయకుండా, ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధిస్తాడనుకున్న కొడుకు కళ్ల ముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చిలుకూరు ఎస్సై రాంబాబు తెలిపారు.

★ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో మేనమామ కళాశాలలో దింపేందుకు వాహనంపై విద్యార్థిని తీసుకొచ్చారు. 'గణిత పుస్తకం తీసుకొని రా మామయ్య' అని చివరగా మేనల్లుడు చెప్పాడని, సోమవారం పుస్తకం తీసుకొస్తానని చెప్పానని మేనమామ కన్నీటి పర్యంతమయ్యారు.

పల్లె దవాఖానాలకు సొంత భవనాలెప్పుడో..?



ప్రైవేటు భవనంలో నడుస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలకు సొంత భవనాల నిర్మాణాల్లో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోంది. దీంతో అద్దె భవనాల్లో అసౌకర్యాల నడుమ సేవలందిస్తున్నారు. మండలానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా ..గ్రామాల వారంతా సాధారణ జ్వరాలకు ఇక్కడికి వచ్చేందుకు దూరం అవుతుండటంతో ప్రభుత్వం పల్లెదవాఖానాలను, ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభించింది. వీటిని ఆయా గ్రామాల వాసులకు అనుకూలంగా ఉండేలా ఎంపిక చేసి మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15వ ఆర్థిక సంఘం నిధులు, జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు, టీఎస్ఎంఐడీసీ నిధులతో నిర్మాణాలు చేయాలని నిర్ణయించారు. జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ఉన్నతాధికారులు స్పందించి పల్లెదవాఖానాల నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూడాలి గ్రామాల వాసులు కోరుతున్నారు. మంజూరైనా పల్లెదవాఖానాల నిర్మాణాలు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చూస్తామని జిల్లా ఉపవైద్యాధికారి గీతావాణి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఆసుపత్రుల పరిస్థితి:

★ నల్గొండ జిల్లాలో మొత్తం పల్లెదవాఖానాలు 164 మంజూరయ్యాయి. 80 పల్లెదవాఖానాలకు నిధులు విడుదల చేశారు. కాగా వీటిలో కొన్ని ప్రారంభం కాగా, మిగతావి అసంపూర్తిగా ఉన్నాయి. 24 టీఎస్ఎంఐడీసీ నిర్మించాల్సి ఉండగా నిధులు విడుదల కాలేదు. మిగతా 60 పల్లెదవాఖానాలకు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు కేటాయించాల్సి ఉంది.

★ సూర్యాపేట జిల్లాలో 109 పల్లె దవాఖానాలు మంజూరు కాగా కేవలం 29 భవనాలకు మాత్రమే నిధులు కేటాయించారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు కేటాయించగా ఈ నిధులు సరిపోవని, పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. మిగతా 80 భవనాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

★ యాదాద్రి జిల్లాలో 99 పల్లె దవాఖానాలు మంజూరు కాగా.. వీటిలో భవనాలు ఉన్నవి 36. మిగతా 63 భవనాలకు నిధులు కేటాయించగా.. ఇప్పటి వరకు నిర్మాణాలు మాత్రం ప్రారంభం కాలేదు.



ప్రారంభానికి నోచుకోని జప్తివీరప్పగూడెం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం

29న ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధం సదస్సు

నీలగిరి: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా కమిటీ పేరుతో కాలయాపన చేయడాన్ని మానుకోవాలని ఎంఎస్పీ సీనియర్ నాయకుడు కందుకూరు సోమన్న మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్గొండలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న నల్గొండలో నిర్వహించే ధర్మయుద్ధం సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేశ్, ప్రజా సంఘాల నాయకులు యాతాకుల రాజన్న మాదిగ, నల్ల చంద్రస్వామి మాదిగ, ఇరిగి శ్రీశైలం మాదిగ, వినయ్ మాదిగ, వెంకన్న మాదిగ, సైదులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో ధర్నా

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లో హిందూ సంఘాలపై పోలీసుల లాఠీ ఛార్జీని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హిందూ బంధువులంతా ఐక్యతగా ఉండాలని కోరారు. విశ్వ హిందూ పరిషత్తు మండల అధ్యక్షుడు ఐతరాజు స్వామి, జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, సూరపల్లి శివాజీ, ఇంద్రసేనారెడ్డి, గిరి, బాలకృష్ణ, ముత్యాలు, స్వామి, బాలు పాల్గొన్నారు.


సంస్థాన్ నారాయణపురంలో ధర్నా చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మానాయికుంట నుంచి గట్టుసింగారం, ధర్మారం, కోటమర్తి గ్రామాలను కలుపుతూ చిర్రగూడూరు హైవే వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.9కోట్లు మంజూరు చేయించినందుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కోటమర్తిలో ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు సోమనర్సయ్య పాల్గొన్నారు.

భువనగిరి పట్టణం: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తాడూరు నర్సింహకు మార్కెట్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు హర్షం ప్రకటిస్తూ ఆదివారం పట్టణంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



పల్లెపాలన వదిలి.. బోధనకు కదిలి

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే :

వారంతా జిల్లాలో గత నాలుగేళ్ల కాలంలో గ్రామాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వ పథకాల అమలులో సర్కారు పిలుపును అందుకుని పలు కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఫలితంగా స్వచ్ఛ గ్రామాలుగా వెలుగొందడానికి ఎనలేని కృషి చేశారు. ఇటీవలనే వీరి కొలువును క్రమబద్ధీకరించారు. చేస్తున్నది సర్కారు కొలువు అయినప్పటికీ ఉపాధ్యాయ వృత్తి అంటే అమితమైన గౌరవంతో ఇటీవల డీఎస్సీ లోనూ ప్రతిభ చూపి కొలువులు సాధించారు. పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను వదిలి ఎంచుకున్న పాఠశాలల్లో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఈ విషయమై వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయ కొలువుల్లో చేరిన వారిలో కొందరితో 'న్యూస్‌టుడే' ముచ్చటించింది. సంబంధిత వివరాలు క్లుప్తంగా..

పల్లె సేవలకు మళ్లె చిన్నారుల సేవలు..




మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన దేవసారి నవీన్‌కు చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తిపట్ల అమితమైన గౌరవం. ఆ క్రమంలోనే డీఈడీ అనంతరం బీఈడీని కూడా పూర్తి చేసి టెట్‌లో రెండు పేపర్లకు అర్హత సాధించారు. ప్రస్తుతం అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు చేపడుతున్నారు. అంతకుముందు జేపీఎస్‌గా తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలో విధులు చేపట్టి ఉన్నతాధికారులతో ప్రశంసలు సైతం అందుకున్నారు. అనంతరం బదిలీపై అనాజిపురంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు చేపట్టారు. ఉపాధ్యాయ వృత్తి తన చిరకాల కోరిక అని, అది తీరడం సంతోషమన్నారు.

ఉపాధ్యాయ వృత్తిమీద గౌరవంతో..



ఎండీ. నజీరోద్దీన్ రాజపేట మండలం పాముకుంట ఆవాస గ్రామమైన కాశెగూడెం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఇటీవలనే విధుల్లో చేరారు. ఇదే మండలంలో జేపీఎస్‌గా ఎంపికై తొలుత సోమారం అనంతరం పాముకుంట గ్రామానికి బదిలీ అయ్యారు. పంచాయతీ కార్యదర్శిగా గ్రామాల అభివృద్ధిలో తనవంతు పాత్ర చురుకుగా పోషించడం విశేషం. డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో 160వ ర్యాంకును పొందారు.

వాలుతండాలో విధుల్లో చేరి..



అడ్డగూడూరు మండలం అజీంపేట గ్రామానికి చెందిన లింగాల సోమన్న తన ప్రాథమిక విద్యను పూర్తిగా ఇదే ప్రాంతంలో, ఇంటర్, డిగ్రీ మోత్కూరులో పూర్తి చేసిన డీఈడీని నల్గొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో పూర్తి చేశారు. ఉపాధ్యాయ వృత్తి అంటే అమితమైన గౌరవం కారణంగా ఇటీవల డీఎస్సీలో ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో 60వ ర్యాంకును పొందారు. బొమ్మలరామారం మండలం వాలుతండా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. అయితే సోమన్న అంతకుముందు జేపీఎస్‌గానూ నాలుగేళ్ల పాటు గ్రామం అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించడం విశేషం.

జేపీఎస్ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా..



మోటకొండూరు మండలం తేర్యాల గ్రామానికి చెందిన చామల తిరుపతిరెడ్డి జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా మొదట్లో మోదువాయిగూడెం పోస్టింగ్ అయినప్పటికీ బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామానికి బదిలీ అయి విధులు చేపట్టారు. ఇటీవలనే రెగ్యూలర్ అయినప్పటికీ చదివిన చదువు నిరర్థకం కాకూడదనే కారణంగా డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. 23 ర్యాంకును పొంది తుర్కపల్లి మండలం తిర్మాలాపురం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(సోషల్)గా విధుల్లో చేరారు.

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే:

? యాదగిరిగుట్ట పీహెచ్‌సీలో పాము, తేలు కాటుకు వైద్యం చేయకుండా భువనగిరికి పంపుతున్నారు, ఏర్పాటు చేయాలి. – జాన్, యాదగిరిగుట్ట.

✔ అదేం లేదు, ఆసుపత్రిలో వైద్యం, మందులు అందుబాటులో ఉంది. సిబ్బంది అలా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

– విలియం, వైద్యాధికారి, యాదగిరిగుట్ట పీహెచ్‌సీ.

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే:

? భువనగిరి పట్టణంలోని ప్రిన్స్‌కార్నర్‌చౌరస్తా వద్ద దుకాణాల ఎదుట రోడ్డును ఆక్రమించి వాహనాలు నిలుపుతుండటంతో రద్దీ ఏర్పడి రాకపోకలు సాగించే క్రమంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

– వెంకటేష్, భువనగిరి

✔ రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకుంటాం.

– మధు, సీఐ, భువనగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

ఈ-మెయిల్‌లో వినతి

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని కోరుతూ పలువురు యువకులు ఆదివారం వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. పరిశ్రమ ఏర్పాటుతో తమ ప్రాంతం కాలుష్యం సమస్యలో చిక్కుకుంటుందని పేర్కొంటూ యువకులు చరవాణిల్లోని ఈమెయిల్, జీమెయిల్ ద్వారా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సందేశాలు పంపారు. మిర్యాల మల్లేశం, బాలగోని శివకుమార్, బడుగు రఘు, కల్లూరి నరేశ్, ఎం.డి.అంజద్, బాసాని రాజు, జాల అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం'

వలిగొండ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ద్వారా చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని జై భీమ్ సేనా కమిటీ గ్రామ అధ్యక్షుడు వల్లమల్ల రత్నయ్య అన్నారు. హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్‌లో డీఎస్ఎస్ భవన్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి అదనపు కమిషనర్‌కు ఆదివారం వినతి ప్రతం సమర్పించారు. కార్యక్రమంలో సుందర్‌రావు, స్వామి, సురేశ్, రాజు, రమేశ్, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


తుర్కలషాపురం గ్రామంలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గుండాల ఎస్సై జి.సైదులు

గుండాల, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గుండాల ఎస్సై జి. సైదులు ప్రజలకు సూచించారు. ఆదివారం తుర్కలషాపురం గ్రామంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా సంప్రదించినపుడు వ్యక్తి గత సమాచారం ఇవ్వొద్దని, ఫోన్‌కు వచ్చే అనుమానిత సందేశాలు తెరవొద్దని తెలిపారు. సైబర్ నేరాల సమాచారం తెలిసినా, మోసపోయిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గురువయ్య, పోలీస్ సిబ్బంది మధుకర్, వసంతరావు, శంకర్ పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించిన మూడు రోజుల్లోనే డబ్బులు

ఆలేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ అనుమతితో ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించే రైతులకు మూడు రోజుల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరు, కొలనుపాకలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. . ఏఎంసీ ఛైర్ పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ మొగుళగాని మల్లేశం, చిందకింది చంద్రకళ, ఆరె మల్లేశం, బీసు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట అర్బన్: యాదగిరిగుట్ట మండలం గౌరాయిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. యాదగిరిగుట్ట పురపాలిక పరిధిలోని యాదగిరిపల్లిలో యాదవ సంఘ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు.

✦ గౌరాయిపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం నివాస ప్రాంతంలో ఉండటంతో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనుకూలమైన స్థలాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. వచ్చే పంట కాలం లోపు కేంద్రాన్ని తరలిస్తామని హామీ ఇచ్చారు.


ఆలేరు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వవిప్ అయిలయ్య

గురుస్వాములకు పురస్కారాలు

భువనగిరి, న్యూస్‌టుడే: మహాశాస్త్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుస్వాములకు పురస్కారాలు అందజేశారు. అయ్యప్ప సేవా, , ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను భువనగిరికి చెందిన రత్నపురం శ్రీశైలం గురుస్వామి, గంగిశెట్టి నాగరాజు గురుస్వామి, చీకటిమల్ల రాములుకు ఉప్పల్ మణికంఠ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం శ్రీగురు పురస్కారాలు అందజేశారు. మహాశాస్త్ర సేవా ట్రస్ట్ అధ్యక్షుడు సూదగాని రాజుగురుస్వామి ఆధ్వర్యంలో వారిని సన్మానించి పురస్కారాలు అందజేశారు.


రత్నపురం శ్రీశైలం గురుస్వామికి పురస్కారం అందజేస్తున్న రాజుగురుస్వామి

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని శ్రీసత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళికి 'గురు పురస్కారం' ఆదివారం అందజేశారు.

అన్నప్రసాద వితరణకు విరాళం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భక్తులకు నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ కోసం ఆలయ ఉద్యోగులు ఒక రోజు వేతనం మొత్తం రూ.5.30 లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ద్వారా ఆలయ ఈవో భాస్కర్‌రావుకు అందజేశారు.

ధర్మభిక్షం సేవలు చిరస్మరణీయం

ఆలేరు, న్యూస్‌టుడే: గీత కార్మికుల సంక్షేమానికి, హక్కుల సాధనకు ధర్మభిక్షం అందించిన సేవలు చిరస్మరణీమని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. ఆలేరు గౌడ సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన ధర్మభిక్షం విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ధర్మభిక్షం విగ్రహానికి సీపీఐ, గీతకార్మిక సంఘాల నాయకులు పూలమాలలు వేశారు. అయిలి సత్తయ్య, గనగాని శంకర్‌గౌడ్, చెక్క వెంకటేశ్, మొరిగాడి బొందయ్య, చాపల లింగం పాల్గొన్నారు.


ధర్మభిక్షం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఎన్నిక

రాజపేట, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడిగా మారోజు కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా పెంట సత్యనారాయణ, కోశాధికారిగా రంగ నరేశ్‌గౌడ్‌లను ఎన్నుకున్నట్లుగా తెలిపారు. త్వరలో పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకోవడమే కాకుండా భవిష్యత్తు కార్యాచరణ, తెలంగాణ పునర్నిర్మాణం దిశగా తమ సంఘం పోరాటం చేస్తుందన్నారు.

వైభవంగా కాటమయ్య బోనాలు..కల్యాణం

చౌటుప్పల్(గ్రామీణం, న్యూస్‌టుడే: దండుమల్కాపురంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి-సురమాంబదేవి కల్యాణ మహోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శనివారం రాత్రి బోనాల ఊరేగింపు చేశారు. వనదేవతలకు పూజలు చేశారు. స్వామివారిని మాజీ మంత్రి కృష్ణయాదవ్, తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్ తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


కాటమయ్య బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కూరెళ్ల విఠలాచార్యకు పురస్కారం ప్రదానం

వైవీయూ (కడప): జిల్లా సాహితీ లోకానికి డాక్టరు జానమద్ది హనుమచ్ఛాస్త్రి వరం లాంటి వారని, సీపీ బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని నిర్మించడానికి అహర్నిశలు శ్రమించారని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ పేర్కొన్నారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు, గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవం జరిగింది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం చేశారు.

హామీల అమలు కోరుతూ భారాస రాస్తారోకో


భువనగిరిలో ఆందోళన చేస్తున్న భారాస నాయకులు

భువనగిరి, న్యూస్‌టుడే: రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారాస రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు పట్టణంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో భారాస నాయకులు కొలుపుల అమరేందర్, అతికం లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఏవీ కిరణ్, జనగాం పాండు, సుభాష్, నువ్వుల సుధాకర్ పాల్గొన్నారు.

ఆలేరు: భారాస శ్రేణులు ఆదివారం ఆలేరులో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. భారాస ఆలేరు మండల, పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేశం, గంగుల శ్రీనివాస్, మొగుళగాని మల్లేశం, చింతకింది చంద్రకళ ఉన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే, భారాస నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బి.చందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పట్టణం : రైతుబంధు నిలిపివేతకు నిరసనగా ఆదివారం యాదగిరిగుట్టలో రాస్తారోకో చేపట్టారు. భారాస మండల, పట్టణ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి, నాయకులు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు అంబేడ్కర్ చౌరస్తాలో భారాస నాయకులు రాస్తారోకో నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు పి.రమేశ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో భారాస మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజయ్య, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్: రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బు జమ చేయనందుకు భారాస కార్యకర్తలు చౌటుప్పల్‌లో జాతీయ రహదారి-65పై ఆదివారం ధర్నా నిర్వహించారు. పీఏసీఎస్ ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, భారాస నాయకులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో భారాస ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. భారాస రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి: తుర్కపల్లిలోని భువనగిరి-గజ్వేల్ జాతీయ రహదారిపై భారాస నాయకులు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: రైతు భరోసా, బీమా వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలో భారాస నాయకులు రాస్తారోకో నిర్వహించారు. నాయకులు వెంకటేశం, బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

రాజపేట: రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం స్థానికంగా భారాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గాంధీ కూడలిలో చేపట్టిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చామకూర గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.


చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న భారాస కార్యకర్తలను తొలగిస్తున్న పోలీసులు

మోటకొండూరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద భారాస మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. నాయకులు భూమండ్ల సుధీర్, బొట్ల నర్సింహా, సిరబోయిన నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : భారాస శ్రేణులు పట్టణంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పురపాలిక ఛైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. మాదాపురం, నాగాయిపల్లి, గోపాల్‌పురం, ముల్కలపల్లి, వాసాలమర్రి, మల్కాపురం గ్రామాలలో నాయకులు ఆదివారం పర్యటించారు. పలువురికి సభ్యత్వాలు అందించి పార్టీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు యాట పెంటయ్య, మండల అధ్యక్షుడు బానోతు శత్రునాయక్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నరేందర్‌నాయక్, నర్సింహ, పాండుయాదవ్, స్వామి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: భాపాజను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని భాజపా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కస్తూరి చంద్ర అన్నారు. కంచల్‌తండా గ్రామంలో భాజపా సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు రవీందర్‌రెడ్డి, నరేష్, వినోద్, ప్రవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి

బీబీనగర్: బీబీనగర్ బాంబినో కంపెనీ ఎదుట రైల్వే ఫ్లైఓవర్ కింద అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాలతో భద్రత కల్పించాలని సంస్థ యాజమాన్యాన్ని స్థానికులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకుడు గోలి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు పంజాల పెంటయ్యగౌడ్, ఉప్పలంచి శ్రీకాంత్, కట్ట వినోద్, రాజు, మణికంఠ, నర్సింగ్, మారుతి పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో కోతకు వచ్చిన వరిచేలు నేలవాలాయి. పత్తిచేల్లో పత్తి తడిసి మొలకలు రావడం తోపాటు కాయలు రాలి పోయాయి. మానాయికుంట, వెల్దేవి, అజీంపేట, గట్టుసింగారం తదితర గ్రామాల్లో వీచిన ఈదురు గాలులకు వరిచేలు నేలవాలటంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వెల్దేవిలో బొరోజు శేషమ్మకుచెందిన ఇంటిపైకప్పు రేకులు లేచిపోవడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. ప్రభుత్వం స్పందించి పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.


మానాయకుంటలో ఈదురుగాలులకు నేలవాలిన వరిచేను

వాట్సప్ గ్రూప్ సాయం

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరులో నిరుపేద కుటుంబానికి చెందిన మొహినొద్దీన్-ఫాతిమా దంపతుల చిన్నకుమారుడు యాసిన్ నాలుక క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. మన మోత్కూరు వాట్సప్ గ్రూపు సేకరించిన రూ.30వేల విరాళాల చెక్కును బాధిత కుటుంబానికి గ్రూపు దాతలు ఇండ్ల రాంప్రసాద్, సోమ కృష్ణలు ఆదివారం అందించారు.

కుటుంబానికి..

మోత్కూరు: మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన మామిడి విజయ్(36) వారం క్రితం మరణించగా గ్రామానికి చెందిన బీసీ యువజన సంఘాల ఆధ్వర్యంలో రూ.37 వేల సాయం అందించారు. యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రామన్నపేట, న్యూస్‌టుడే: ఇంద్రపాలనగరంలో వ్యవసాయ బావి వద్ద విద్యుదాఘాతంతో ఆవుల పద్మ (56)అనే మహిళ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై పి.మల్లయ్య తెలిపారు. పద్మ తెల్లవారుజామున వ్యవసాయ బావి వద్దకు బయలుదేరింది. ఓ రైతు పొలం వద్దకు చేరుకోగానే శనివారం రాత్రి పొలంలో పిడుగుపాటుకు తెగిన విద్యుత్తు తీగ ప్రమాదవశాత్తు తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన పద్మ అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు ఆవుల లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


ఆవుల పద్మ

అశోక్‌గౌడ్‌కు నివాళులు

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు జడల అమరేందర్‌గౌడ్ సోదరుడు జడల అశోక్‌గౌడ్ దశదినకర్మ కార్యక్రమంలో పట్టణంలో ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలు చేపడతాం: సీపీఎం

రామన్నపేట, న్యూస్‌టుడే: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ పిలుపునిచ్చారు. మునిపంపులలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన అమరవీరుల స్మారక భవనాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. సీపీఎం కార్యాలయాలు ప్రజా పోరాటాలకు కేంద్రంగా నిలుస్తాయని చెప్పారు. ఆధిపత్య వర్గాలను వ్యతిరేకించటంతో పాటు ప్రజా సమస్యలపై సీపీఎం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ స్ఫూర్తితో గ్రామాల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా అమలుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, బల్గూరి అంజయ్య, మేకల కృష్ణ, జంపాల అండాలు, తొలుపునూరి శ్రీనివాస్, ముత్యాలు, తాళ్లపాక జితేందర్ తదితరులు పాల్గొన్నారు.


మునిపంపులలో అమరవీరుల స్మారక భవనాన్ని ప్రారంభిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలి

మోటకొండూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహంగీర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు ఆదివారం నిర్వహించిన మండల మహాసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గతంలో చేసిన పోరాట ఫలితమే బునాదిగాని కాల్వకు రూ.266.65 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. మోటకొండూరు మండలం ఏర్పాటు చేసి నిమిదేళ్లవుతున్నా ఇంత వరకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, బోలగాని జయరాములు, కొల్లూరు ఆంజనేయులు, ముత్యాలు, రవి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామశ్రీ' సేవా శిబిరం

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో రామకృష్ణ మఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదివారం 'గ్రామశ్రీ' సేవ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందు బిల్లలు పంపిణీ చేశారు. కోఆర్డినేటర్ వేణు, జయమ్మ, నిత్యానంద్, శ్రీనివాస్, సత్యనారాయణ, విఘ్నేష్, వెంకటేశ్, ప్రతాప్, బాలు, సాయి కృష్ణ, శివప్రసాద్, నిఖిల్, అభిరామ్ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి

గన్నవరం గ్రామీణం: ఈత సరదా ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు తీసింది. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. గన్నవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గన్నవరం మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ నాలుగో ఏడాది చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు సరదాగా కొండపావులూరులోని క్వారీ గోతుల వద్దకు వచ్చారు. తొలుత అదే కళాశాలకు చెందిన ద్వితీయ ఏడాది విద్యార్థులు అక్కడికి చేరుకొని తిరిగి వెళ్లారు. లోతు లేదని వారు చెప్పడంతో.. నాలుగో ఏడాది విద్యార్థులు వచ్చారు. తిరువూరు నియోజకవర్గానికి చెందిన పగడాల దుర్గాప్రసాద్(21), యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం రాజానగరం గ్రామానికి చెందిన జగ్గరాజు వెంకటేశ్‌రాజు (21), నందూరి సునాథ్, టి.అమర్‌నాథ్‌రెడ్డి, జగదీష్, బి.జీవన్, పి.లక్ష్మీనారాయణ, జి.యుగేందర్ అనే ఎనిమిది మంది విద్యార్థులు కళాశాల హాస్టల్ నుంచి ఇక్కడకు వచ్చారు. సరదాగా కొంత సేపు ఈతకొట్టారు. తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో వెంకటేశ్‌రాజు పెద్ద గోతిలో జారిపడ్డాడు. కాపాడేందుకు ప్రయత్నించిన దుర్గారావు కూడా నీళ్లలో మునిగారు. అప్రమత్తమైన మిగిలిన విద్యార్థులు పోలీసులు, పక్కనే ఉన్న పదో బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి క్వారీలో మునిగిన వెంకటేశ్‌రాజు, దుర్గారావుల మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు రోదించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.